క్లుప్తంగా

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు



శ్రీకాకుళం రూరల్ : మండల పరిధిలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లలో ఎస్సీ, ఎస్టీ, అనాథ పిల్లలకు ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఎంఈవో ఎస్.కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి మే 15 వరకు గ్రామ వార్డు సచివాలయాలు, మీ సేవా కేంద్రాలు, మండల విద్యా శాఖ కార్యాలయాల్లోనూ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

రిమ్స్ అన్నపూర్ణకు విరాళం

శ్రీకాకుళం కల్చరల్ : రిమ్స్‌లోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నపూర్ణ సంఘం అన్నప్రసాద కార్యక్రమానికి హయాతినగరానికి చెందిన డాక్టర్ రఘుచాణక్య తన తండ్రి ఫల్గుణరావు పుట్టిన రోజు సందర్భంగా రూ.10వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వీఆర్ఏలు

జి.సిగడాం: వీఆర్ఏల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్ర, జిల్లా స్థాయి సంఘాల పిలుపు మేరకు పోరాటాలు తప్పవని వీఆర్ఏల సంఘం ప్రతినిధులు కె.వి.డి.అప్పారావు, డి.పోతయ్య, జి.వెంకటరమణ, టి.లత, టి.వెంకటేష్ అన్నారు. ఈ మేరకు సోమవారం జి.సిగడాం తహశీల్దార్ ఎం.శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం నుంచి రాయితీలు వర్తింపజేయాలని, అర్హులైన వారికి ప్రమోషన్లు కల్పించాలని, పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావంతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శర్వాణి విద్యాలయ అధినేత అంధవరపు సూరిబాబు అన్నారు. నగరంలోని కోడిరామమూర్తి స్టేడియం వద్ద అంబేద్కర్ ఆడిటోరియంలో సోమవారం శర్వాణి విద్యాలయ వార్షికోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విశ్రాంత డీఈవో బలివాడ మల్లేశ్వరరావు, శర్వాణి విద్యాలయ హెచ్ఎం కె.రేఖ, కరస్పాండెంట్ ఎ.అంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లుపై 6-ఏ కేసు నమోదు

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం రూరల్ మండలంలోని నైరాలో శ్రీ కన్య మోడరన్ రైస్ మిల్లుపై సోమవారం 6ఏ కేసు నమోదు చేశారు. మిల్లుపై ఇటీవల అందిన ఫిర్యాదు మేరకు తనిఖీలు చేపట్టాలని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్.. జిల్లా సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మేనేజర్, రెవెన్యూ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం డీఎంసీఎస్ వేణుగోపాల్, తహశీల్దార్ గణపతిరావు, అసిస్టెంట్ మేనేజర్ టెక్నికల్ కె.శ్రీనివాస్, సీఎస్‌డీటీ చక్రవర్తి తనిఖీలు చేపట్టారు. ధాన్యం సేకరణలో భాగంగా నిర్దేశిత మొత్తం కంటే తక్కువ నిల్వ ఉన్నందున కేసు నమోదు చేశారు.

టైలరింగ్ శిక్షణ ప్రారంభం



శిక్షణను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం/జి.సిగడాం: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ఉచిత కుట్టు మిషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. ఏపీ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ (టైలరింగ్) కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ జిల్లా కో ఆర్డినేటర్ చంద్రశేఖర్, ఏపీఎం మాధవీలత పాల్గొన్నారు. అనంతరం జి.సిగడాంలో కుట్టు శిక్షణ, పశువులకు నీటికుండీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, ఎంపీడీఓ జి.రామకృష్ణారావు, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం

ఎచ్చెర్ల క్యాంపస్: భూ సారం పెంచే నవధాన్యాలు సాగుకు రైతులు ముందుకు రావాలని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు నార్త్ కోస్టల్ రీజనల్ అధికారులు ప్రకాష్, హేమసుందర్ అన్నారు. జరజాం రైతు సేవా కేంద్రంలో సోమవారం నవధాన్యాలు సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.

ప్రకటనలేనా.. పరిష్కారమయ్యేనా?

- ఇటీవల సభలో హామీలు గుప్పించిన సీఎం చంద్రబాబు
- సాగునీరు, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రజల ఎదురుచూపులు



నారాయణపురం కాలువ పరిస్థితి



నారాయణపురం ఆయకట్టు హెడ్ రెగ్యులేటర్ దుస్థితి

ఎచ్చెర్ల క్యాంపస్ : ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని కొన్ని ప్రధాన సమస్యలు వెంటాడుతున్నాయి. గత ఏడాది సాగునీటి సమస్య వల్ల చాలా మంది రైతులు పంటలు కోల్పోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత 11 నెలల్లో కనీస స్థాయిలోనూ సమస్యలపై దృష్టిపెట్ట లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 26న నియోజకవర్గంలోని ఎచ్చెర్ల మండలం బుడగుట్లపాలెం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో ప్రతి సమస్య పరిష్కరిస్తానని సీఎం సైతం మాటిచ్చారు. అయితే సూపర్‌సిక్స్ హామీలు మాదిరిగానే ఈ హామీలు కూడా కార్యాచరణకు నోచుకుంటాయో లేవోనని నియోజకవర్గ ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

వెంటాడుతున్న సాగునీటి సమస్య..

ఎచ్చెర్ల మండలానికి ప్రధానంగా సాగునీరు వనరు నారాయణపురం కుడి కాలువ. గత ఏడాది ఖరీఫ్‌లో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు పంటలు కోల్పోయారు. మరోవైపు రణస్థలం, లావేరు మండలాలకు సాగునీరు అందించే తోటపల్లి కాలువ సైతం నీరు అందించడం లేదు. జి.సిగడాం మండలానికి సాగునీరు అందించే మడ్డువలస ప్రాజెక్టుదీ అదే దారి. ఈ మూడు ప్రాజెక్టుల ద్వారా జిల్లాలో 40 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. ఈ సారైనా అధికారులు, పాలకులు ప్రత్యేక దృష్టి సారించకపోతే సాగునీరు అందక రైతులు మరోసారి ఇబ్బంది పడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మే నెలలో మరమ్మతులు చేసి ఖరీఫ్‌కు సాగునీరు అందించాలని రైతులు వేడుకుంటున్నారు.

- కొవ్వాడ అణువిద్యుత్ ప్రాజెక్టు నిర్వాసితుల కోసం ఎచ్చెర్ల మండలం ధర్మవరంలో పునరావాస కాలనీ నిర్మాణానికి స్థల సేకరణ చేశారు. ఈ స్థలంలో కాలనీ నిర్మాణం చేపట్టనున్నట్లు సీఎం హామీ ఇచ్చారు. ఈ పనులు వీలైనంత త్వరగా ప్రారంభించాలని నిర్వాసితులు కోరుతున్నారు.
- రణస్థలం మండలం పైడిభీమవరంలో పారిశ్రామికసెజ్‌లో అనేక పరిశ్రమలు ఉన్నాయి. అయితే నైపుణ్యం లేకపోవటం వల్ల స్థానికులకు ఉద్యోగాలు లభించటం లేదు. ఈ నేపథ్యంలో పరిశ్రమ అవసరాలకు తగ్గట్లు శిక్షణ ఇప్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. దీనికోసం నిరుద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్నారు.
- బుడగుట్లపాలెంలో ఇళ్లు లేని 18 మందికి ఆరు నెలల్లో మూడు సెంట్లు చొప్పున ఇంటి స్థలం కేటాయించాలని, ఇళ్లు మంజూరు చేయాలని సీఎం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గడువులోగా సమస్య పరిష్కరిస్తారో ? లేదో ? వేచి చూడాలి.
- ఎచ్చెర్ల మండలంలో మత్స్యకారులకు ఉపాధి, వలసలు నిర్మూలన లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2023 ఏప్రిల్ 19న ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. రూ.366 కోట్లతో టెండర్లు సైతం పూర్తిచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు నిలిపివేశారు. గత 11 నెలలుగా ఈ పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా నిలిచిపోయాయి. రానున్న 12 నెలల్లో ఈ పనులు పూర్తిచేస్తామని సీఎం తాజాగా హామీ ఇచ్చారు. 11 నెలలుగా పట్టించు కొని కూటమి ప్రభుత్వం ఈ హామీ ఎలా నేరవేర్చుతుందో వేచి చూడాల్సిందే.

సాగునీటి సమస్య పరిష్కరించాలి



రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల నియోజకవర్గంలో సాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఎం నాయకులు, ఏపీ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పొందూరు చంద్రరావు, కె.మోహన్‌రావు, విశ్రాంత ప్రిన్సిపాల్, యూటీఎఫ్ నాయకులు కొత్తకోట అప్పారావు డిమాండ్ చేశారు. సాగునీటి సమస్యపై మే 2, 3 తేదీల్లో నిర్వహించనున్న జీపు జాతరపై ఫరీదుపేటలో రైతులకు అవగాహన కల్పించి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులు నిర్లక్ష్యం చేస్తోందని ధ్వజమెత్తారు. కాలువల మరమ్మతులు చేపట్టకపోవటం వల్ల గత ఖరీఫ్‌లో ఎచ్చెర్ల నియోజకవర్గంలో పంటలు ఎండిపోయాయని గుర్తు చేశారు. ప్రధానంగా ఎచ్చెర్ల మండలం నారాయణపురం ఆయకట్టు కింద 13 గ్రామ పంచాయతీల రైతులు ఇబ్బంది పడుతున్నారని, పంటలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఖరీఫ్‌కైనా ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గొల్లపల్లి శ్రీరామ్మూర్తి, కొత్తకోట అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయం అందరిది



మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని రంగిరీజు వీధిలో ఉన్న శ్రీఅంబాభవానీ ఆలయం అందరిదని, తమకే సొంతమని కొందరు వాదించడంలో అర్థం లేదమని ఆలయ ఆర్గనైజింగ్ సెక్రటరీ మదన్ మోహన్ సింగ్ అన్నారు. ఆలయం వద్ద సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆలయానికి వచ్చే నిధులను ఒక సామాజికవర్గానికే వినియోగించుకోవడం తగదని చెప్పారు. ఆలయ అభివృద్ధికి, ఇతర దైవ కార్యక్రమాలకు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. కోర్టు కేసుల్లో ఉన్న వ్యక్తులు ఆలయ కార్యక్రమాల్లో జోక్యం చేసుకోవడం తగదన్నారు. ఆలయ నిర్మాణం జరిగి 50 ఏళ్లవుతోందని, ఇలాంటి గొడవలు ఎప్పుడూ లేవని, కొందరు వ్యక్తుల జోక్యం వల్లే ఇప్పుడు వివాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. సమావేశంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు గుజ్జురు ఆనందప్రసాద్, బుర్ల సత్యనారాయణ, ఏ.మహేశ్వరరావు, పట్నూరు మహేష్, మల్లు సత్యనారాయణ, బయికర్ లింగూజీ, కటారి జనార్దన, బుజ్జిబాబు, బాయికర్ నాగరాజు, పతంగి ఆనంద స్వరూప్, ఎస్.నాగరాజు పాల్గొన్నారు.

పన్నుల రాయితీని సద్వినియోగం చేసుకోండి



ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నగరపాలక సంస్థ పరిధిలో గృహ, వాణిజ్య సముదాయ యజమానులు 2024-25 ఆర్థిక సంవత్సరంలో చెల్లించాల్సిన ఆస్తి పన్ను బకాయిల వడ్డీపై ప్రభుత్వం 50 శాతం రాయితీ, 2025-26 ఆర్థిక సంవత్సరం ఆస్తి, కుళాయి, ఖాళీ స్థలం పన్ను బకాయిల చెల్లింపుపై 5 శాతం రిబేటు వర్తింపజేస్తున్నట్లు కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు తెలిపారు. ఈ నెల 30తో గడువు ముగుస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ప్రచార వాహనాన్ని సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. మే నెల నుంచి అదనంగా 2% వడ్డీ పడుతుందన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంతో పాటు హడ్కో కాలనీ, గొంటి వీధి, చౌదరి సత్యనారాయణ కాలనీ, కిల్లిపాలెం-1, కిల్లిపాలెం-2 సచివాలయాల్లోనూ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కిమ్స్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న మున్సిపల్ ఖాళీ స్థలంలో 100 షాపులను తాత్కాలిక పద్ధతిలో ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వీధి వ్యాపారులు, వ్యాపారస్తులు ఈ నెల 29 నుంచి మే 5 వరకు మున్సిపల్ కార్యాలయంలో స్వయంగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇంటర్వ్యూ ద్వారా అర్హులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు ఒరిజినల్ ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్, పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు-3, పాన్‌కార్డులతో హాజరుకావాలని కోరారు.

ఉగ్రదాడి దారుణం



కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న ఏపీడబ్ల్యూజే నాయకులు



డి.ఆర్.వలసలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/జి.సిగడాం: జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై దాడి దారుణమని ఏపీయూడబ్ల్యూజే కార్యవర్గ సభ్యుడు ఎన్.ఈశ్వరరావు అన్నారు. ఉగ్ర దాడిని నిరసిస్తూ శ్రీకాకుళం నగరంలో సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఈడబ్ల్యూజే నాయకులు పాల్గొన్నారు. జి.సిగడాం మండలంలో డి.ఆర్.వలసలో సుమారు 500 మంది యువత, గ్రామస్తులు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు.

బాల్య వివాహాలు అడ్డగింత

రణస్థలం : మండలంలోని చిల్లపేట రాజాం పంచాయతీ బొడ్డపాడులో మే నెలలో జరగాల్సిన రెండు బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. మైనర్ బాలికకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని సోమవారం తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు పూర్తి కాకుండా వివాహం చేస్తే చట్టరీత్యా శిక్ష తప్పదన్నారు. అనంతరం తల్లిదండ్రుల వద్ద అంగీకార పత్రం తీసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.శ్యాంసుందరరావు, వీఆర్వో వై.తవిటయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.మంగమ్మ, చైల్డ్ వెల్ఫేర్ కో ఆర్డినేటర్ గీత, మహిళా పోలీస్ ఆర్.సత్యం, అంగన్వాడీ కార్యకర్తలు బి.ముగతమ్మ, సీహెచ్ రమా తదితరులు పాల్గొన్నారు.

మినీ రిజర్వాయర్లుగా చారిత్రక చెరువులు



వినతిపత్రం అందిస్తున్న బీసీ సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సోంపేట, కంచిలి మండలాల్లో ఏడు చారిత్రాక చెరువులను మినీ రిజర్వాయర్లుగా అభివృద్ధి చేయాలని బీసీ వెల్ఫేర్ అసోసియేషన్, రైతాంగ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ పొన్నాడ సుధాకర్‌కు ఆయన చాంబర్‌లో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావు, సంఘం న్యాయ సలహాదారు చౌదరి లక్ష్మణరావు, పల్లి హరిచంద్ర, జయరాం పల్లి నాగేశ్వరరావు, మోహనరావు, గేదెల దేవరాజ్ పాల్గొన్నారు.

చెరువులో ఆక్రమణలు తొలగించాలని వినతి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట పంచాయతీలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న లచ్చయ్య చెరువుకు హద్దులు నిర్ణయించి ఆక్రమణలు తొలగించాలని గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్మీ అధికారి పైడి నారాయణమూర్తి, కృష్ణమూర్తి, నరసింహులు తదితరులు కోరారు. ఈ మేరకు ఎచ్చెర్ల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం తహశీల్దార్ బి.గోపాలరావుకు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 557/3లో 1.63 ఎకరాల్లో ఉన్న ఈ స్థలంలో కొందరు చెరువు ఆక్రమించి గోడలు, ప్రహరీ వంటి నిర్మాణాలు చేపడుతున్నారని, సర్వే చేసి హద్దులు నిర్ణయించి, చెరువును సంరక్షించాలని కోరారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ సర్వే బృందం చెరువును పరిశీలిస్తుందని చెప్పారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేట గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు పేడాడ సంజీవమ్మ ఇటీవల మృతి చెందారు. ఈమె కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సోమవారం పరామర్శించారు. ఆయన వెంట జిల్లా వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, మండల పార్టీ అధ్యక్షులు బోర సాయిరాంరెడ్డి ఉన్నారు.

మామిడి పండ్లతో నైవేద్యం



నగరంలోని నక్కవీధిలో కొలువైన ఉమాజఠలేశ్వర స్వామి వారికి మామిడి పండ్ల నైవేద్యం సమర్పించారు. మామిడి పండ్ల సీజన్ ప్రారంభం కావడంతో భక్తులు మొదటి పంటగా స్వామివారికి నైవేద్యంగా అందజేశారు.

శ్రీకాకుళం కల్చరల్:

చిత్రలేఖన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజయవాడలోని డ్రీమ్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఆల్ ఇండియా చిత్రలేఖన పోటీల్లో అరసవల్లికి చెందిన మణిపాత్రుని క్రియేటివ్ అకాడమి విద్యార్థులు బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలు సాధించారని సంస్థ వ్యవస్థాపకులు మణిపాత్రుని నాగేశ్వరరావు తెలిపారు. అకాడమీ నుంచి 40 మంది హాజరుకాగా, బి.సనీత్, జస్వీర్, జ్యోతిష్యదేవి, శశిభూషణ్ సాయిరాజ్, నవీన్, సాయి తేజస్విని, తరుణ్, చైతన్య, లిపిశ్రీవల్లిలకు బంగారు పతకాలు, పునీత్, జయదేవ్‌కుమార్, పవన్, అఖిలకు వెండి పతకాలు లభించాయని వివరించారు. -శ్రీకాకుళం కల్చరల్

రామకౌండిన్యకు ప్రతిభా పురస్కారం



నగరానికి చెందిన రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్యుడైన రామకౌండిన్యకు అంతర్జాతీయ నృత్యోత్సవంలో ప్రతిభా పురస్కారంతో సత్కరించారు. హైదరాబాద్‌లోని శిల్పారామంలో జరిగిన నృత్య సమ్మేళనం-2025 కార్యక్రమంలో భాగంగా ఈ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా రామకౌండిన్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనతో ఆహూతులను అలరించింది.
- శ్రీకాకుళం కల్చరల్

పక్షిఈకపై రవివర్మ చిత్రం





శ్రీకాకుళం కల్చరల్: హిందూ దేవతా చిత్రాలను అందమైన తైలవర్ణ రూపాలతో చిత్రీకరించిన చిత్ర కళాకారుడు రవివర్మ జయంతిని పురస్కరించుకుని జిల్లాకు చెందిన చిత్రకారుడు రాహుల్ పట్నాయిక్ పక్షి ఈకపై రవివర్మ చిత్రాన్ని వేసి ఆకట్టుకున్నారు. రవివర్మతో పాటు హంస, దమయంతి, శకుంతల, లక్ష్మీదేవి, అహల్య, రంభ, మోనక, తిలోత్తమ, మహాశ్వేతాదేవి, ప్యాలెస్ చిత్రాలను అద్భుతంగా చిత్రీకరించారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు, ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా కార్యదర్శి వై.అప్పయ్య, నాయకులు ఎంఎస్ రావు, వి.డి.రావు, ఎంఆర్ మూర్తి డిమాండ్ చేశారు. రెండు రోజుల నిరసనలో భాగంగా సోమవారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఎన్ఎంయూ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని, ఆర్టీసీ ఉద్యోగుల అక్రమ సస్పెన్షన్లు, అక్రమ రిమూవల్స్‌ను వెంటనే ఆపాలని, నాలుగేళ్లు ఆగిపోయిన పదోన్నతులు వెంటనే కల్పించాలని, మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని, నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దీక్షా శిబిరాన్ని ఎన్ఎంయూ జోనల్ కార్యదర్శి బీఎస్ రాములు సందర్శించారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు కె.నర్సింహులు, ఆర్ఎస్ చలం, ఏఎల్ రావు, వి.వి.బి.రావు, కె.కళ్యాణి, వి.వి.ఆర్.కళ్యాణి, జి.ఆర్.బాబు, బి.ఎస్.చలం, కె.తవిటయ్య, ఈ.అన్నపూర్ణ, పి.ఎస్.రావు, ఎ.ఆర్.బాబు, ఆర్.కె.మూర్తి, బి.గౌరి, సీహెచ్.టి.రావు, సీహెచ్ఆర్.వి.ఎస్.మూర్తి, బి.ఎస్.బాబు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం



గార: శిక్షణా శిబిరంలో మాట్లాడుతున్న లైబ్రేరియన్ రామకృష్ణ



శ్రీకాకుళం కల్చరల్: లాఫింగ్ క్లబ్‌లో శిక్షణకు హాజరైన చిన్నారులతో నిర్వాహకులు



శ్రీకాకుళం అర్బన్: కేంద్ర గ్రంథాలయంలో మాట్లాడుతున్న సురంగి మోహనరావు



శ్రీకాకుళం అర్బన్: హడ్కోకాలనీ గ్రంథాలయంలో సరస్వతిదేవి చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

గార: వేసవి శిక్షణా శిబిరాలను విద్యార్థుకు సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత జూనియర్ అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్ జి.కుమారస్వామి అన్నారు. గార శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ ఎన్.రామకృష్ణ మాట్లాడుతూ డ్రాయింగ్, వ్యాసరచన, వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహిస్తామని, చిన్నారులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో శరత్‌చంద్ర, లైబ్రరీ అసిస్టెంట్ సీహెచ్ సూర్యనారాయణ, పాఠకులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని విశ్రాంత జెడ్పీ సీఈవో సురంగి మోహనరావు అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజు ఆధ్వర్యంలో వేసవి విజ్ఞానశిబిరాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎం.ఉపేంద్ర శర్మ, ఎస్.సాయి కృష్ణ, సోడవరం ఈశ్వరరావు, ఉప గ్రంథాలయాధికారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: బలగ హడ్కో కాలనీలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం సోమవారం ప్రారంభమైంది. జూన్ 6 వరకు శిబిరం కొనసాగుతుందని బలగ గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్ ఇన్‌చార్జ్ హెడ్ మాస్టర్ అన్నెపు పున్నయ్య, బాల కథానిలయం అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు, గ్రంథాల సహాయకురాలు కె.అనిత తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సంయుక్త ఆధ్వర్యంలో 40రోజుల వేసవి శిక్షణ శిబిరం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, సెట్‌శ్రీ అధికారి ప్రసాదరావు, రిటైర్డ్ సెట్‌శ్రీ సీఈఓ సురంగి మోహనరావు, లైన్స్ మెంటార్ నటుకుల మోహన్ మాట్లాడుతూ చిత్రలేఖనం, క్రాఫ్ట్, వెస్టర్న్ డ్యాన్సు, కూచిపూడి నృత్యాలపై శిక్షణను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇంటాక్ ప్రతినిధి కేవీజే రాధాప్రసాద్, లయన్స్ క్లబ్ సెంట్రల్ ప్రతినిధి దేవభూషణరావు, సుధారాణీ, టూరిజం అధికారి నారాయణరావు, లైన్స్ ప్రతినిధి సింధూర, లాఫింగ్ క్లబ్ నిర్వాహకులు ఎల్.నందికేశ్వరరావు, బీఎంఎస్ పట్నాయక్, నృత్య దర్శకురాలు టి.నీరజ, మల్లేశ్వరరావు, దుర్గాప్రసాద్, దీప్తి, తదితరులు పాల్గొన్నారు.